## క్లుప్తంగా

### నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

**రాయచోటి అర్బన్ :** రాయచోటి మున్సిపల్ సర్వసభ్య సమావేశం 31వ తేదీన జరుపనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా అధ్యక్షతన సభా భవనంలో ఉదయం 10:30గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులతోపాటు అన్ని ప్రభుత్వశాఖల అధికారులు తప్పక హాజరుకావాలంటూ కోరారు.

### మండల సమావేశం నేడు

**రాయచోటి అర్బన్ :** రాయచోటి రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 31వతేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ పల్లపు రాజమ్మ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతోపాటు అధికారులు హాజరుకావాలని కోరారు.

### శ్రీ అన్నమయ్య ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక




ఇండ్లూరు వెంకటరెడ్డి బచోటి భాస్కర్

**రాజంపేట టౌన్ :** శ్రీ అన్నమయ్య ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఇండ్లూరి చిన్నవెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా వనంలో సోమవారం ఆ క్లబ్ మాజీ అధ్యక్షుడు జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దార్ల శ్రీనివాసులు ఆచారి, పాబోలు ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా బచోటి భాస్కర్, కార్యదర్శులుగా తుపాకుల సురేష్, బత్తిన రామసుబ్బారెడ్డి, షేక్ అలీషేర్, కోశాధికారిగా జీవీపీఆర్‌కే, రాయులు, సహాయ కార్యదర్శులుగా ఎం.ఓబులేసు, మందా శివయ్య, కళాంజలి కల్యాణ్‌లతోపాటు కార్యనిర్వాహక కార్యదర్శులు, ప్రచార కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి, జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

### సర్వేయరుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

**రాయచోటి అర్బన్ :** పీలేరు తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయరుగా పనిచేస్తున్న రెడ్డెన్నపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని అన్నమయ్య జిల్లా కేవీపీఎస్ అధ్యక్షుడు డి.సి.వెంకటయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోర్టు వివాదంలో ఉన్న భూమికి తాను సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదని చెప్పిన సర్వేయర్ రెడ్డెన్నపై కొందరు దుర్భాషలాడుతూ దాడికి దిగడం హేయమైన చర్య అన్నారు. తాము చెప్పినట్లు వినని అధికారులను భయభ్రాంతులకు గురిచేయడం కొందరికి అలవాటుగా మారిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దాడి కారకులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

### బాల్య వివాహాలు నేరం

**గాలివీడు :** బాల్యవివాహాలను నిర్మూలించాలని లక్కిరెడ్డిపల్లె సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నూలివీడు సెక్టారు పరిధిలోని బాల్య వివాహాల నిర్మూలన, రక్త హీనతపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలతో పిల్లల ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయస్సులోనే వివాహం చేయడం మానుకోవాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాల గురించి తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098, 112, 100, 181 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### 108లో ప్రసవం



**సిద్దవటం :** మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీకి చెందిన బి.వరలక్ష్మి సోమవారం రాత్రి 108 వాహనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు సిద్దవటం మండలం 108 వాహనం సిబ్బంది ఈఎంటీ జి.వరలక్ష్మి, పైలెట్ కె.వి.సురేష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం ఎస్టీ కాలనీకి చెందిన బి. వరలక్ష్మి డెలివరీ కోసం సిద్దవటంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం ఉదయం చేరిందన్నారు. అక్కడ డెలివరీ కాకపోవడంతో వైద్యులు కడప రిమ్స్ ఆసుపత్రికి రెఫర్ చేశారన్నారు. దీంతో ఆమెను 108 వాహనంలో సోమవారం రాత్రి రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ్వవడంతో ఈఎంటీ జి.వరలక్ష్మి ఆమెకు కాన్పు చేసిందన్నారు. అనంతరం వారిని కడప రిమ్స్‌లో చేర్పించినట్టు చెప్పారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వారు తెలిపారు.

# పేదల ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష



వీరబల్లె (రాయచోటి టౌన్): జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

**వీరబల్లె (రాయచోటి టౌన్) :** పేద ప్రజల ఆరోగ్యంగా ఉండటం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాటిగుంటపల్లె గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన, కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాటిగుంటపల్లె సర్పంచ్ గోపీనాథరెడ్డి, ఎంపీపీ మల్లీశ్వరి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, వీఆర్ విద్యాసంస్థ అధినేత వీఆర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగిమళ్ల మధుసూదన్‌రెడ్డి, రెడ్డెయ్య రెడ్డి, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

**ఇంటి ముందుకే వైద్యం**

**చిట్వేలి :** ప్రతి ఇంటి ముందుకు వైద్యాన్ని చేర్చి అందరిని ఆరోగ్యవంతులుగా చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లింగం లక్ష్మీకర్ పేర్కొన్నారు. నగిరిపాడు పంచాయతీ కేంద్రంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జనరంజకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వును చూడాలన్నదే జగనన్న ఆశయమని, దీనిని దృష్టిలో ఉంచుకొని అందరూ పనిచేయాలని కోరారు. బీపీ, షుగర్ తదితర అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వడ్డించే భోజనాన్ని లక్ష్మీకర్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం**

**రామాపురం :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు వరంలాంటిదని ఎంపీడీఓ హైదర్‌వలి, వైద్యాధికారి విజయ్‌కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సరస్వతిపల్లె గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించారు. గ్రామాలలో పలు రకాల వ్యాధులకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామాల్లో జరిగే ఆరోగ్య సురక్షలో పలు వ్యాధులకు చికిత్సలు అందించి ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. దీర్ఘకాలికంగా అనుభవిస్తున్న రోగులకు పెద్ద ఆసుపత్రులలో చికిత్సలకు రెఫర్ చేస్తున్నట్టు తెలియజేశారు. ప్రతి ఒక్కరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చిట్వేలి: వైద్య పరీక్ష చేయించుకుంటున్న లక్ష్మీకర్

# ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించండి

రాజంపేట డీఎస్పీ వీఎన్‌కే చైతన్య

**ఓబులవారిపల్లె :** జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని రాజంపేట డీఎస్పీ వీఎన్‌కే చైతన్య పేర్కొన్నారు. సోమవారం మంగంపేట ఏపీఎండీసీ సభా భవనంలో ఉద్యోగులు, డ్రైవర్లు, ప్రజలతో ప్రమాదాలు జరగకుండా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అజాగ్రత్త, అతివేగం వలన ప్రాణాలు కోల్పోతున్నారని, మంగంపేట వాహనాలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉందని లారీలు, టిప్పర్లు జాతీయ రహదారిపై వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మంగంపేట జాతీయ రహదారి నుంచి రెడ్డిపల్లి కట్ట వరకు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు అక్కడక్కడ స్టాపర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్ రెడ్డి, రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఏపీఎండీసీ ఎస్ఐ శివ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ వీఎన్‌కే చైతన్య

# దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**సిద్దవటం :** దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని లేదంటే దానివల్ల జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఐ.సుబ్బరాయుడు తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ నివాస గృహాల చుట్టూ మురుగు నీటి గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. దానివల్ల దోమల లార్వా ఉత్పత్తి చెంది దోమల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. రాత్రి వేళల్లో దోమల నివారణకై ఫుల్ వస్త్రాలను వేసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. వేప పొగను వేసుకుంటే దోమలను నివారించవచ్చునన్నారు. అలాగే తాగి పడేసిన కొబ్బరి బొండాన్ని రెండు భాగాలు చేయాలన్నారు. దీంతో దోమలను అరికట్టవచ్చునన్నారు. డెంగ్యూ లక్షణాల నిర్ధారణ కోసం వైద్యశాలలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని మలేరియా అధికారి తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పి.కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితలరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి సుబ్బరాయుడు

# ఆర్థో వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

**రాజంపేట రూరల్ :** ఆకేపాటి ఎస్టేట్‌లో నవంబరు 5వ తేదీన నిర్వహించే ఉచిత మెగా ఆర్థో వైద్య శిబిరాన్ని డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సభా భవనంలో ఆర్డీఓ జి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన డివిజన్ పరిధిలోని ఎంపీడీఓలు, ఏంఈఓలు, వైద్యశాఖ అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో హైదరాబాదు, తిరుపతి, బెంగుళూరు పట్టణాలలోని ప్రముఖ హస్పిటల్స్‌లో వైద్య సేవలు అందించే 25 మంది ఆర్థో వైద్య నిపుణులు పాల్గొంటారని తెలియజేశారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో డివిజన్ పరిధిలో ఎముకల సమస్యలతో బాధపడేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో ఎక్స్ రేలను సైతం తీస్తారని తెలియజేశారు. అవసరమైతే శస్త్రచికిత్సను ఉచితంగా చేయించనున్నట్లు తెలియజేశారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. శిబిరంలో పాల్గొనే వారికి ఉదయం, మధ్యాహ్న భోజన వసతి కల్పించనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, డీఎల్‌డీఓ రమేష్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ ఎస్.చిన్నికృష్ణ, రమేష్, మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్ధనరెడ్డి, డాక్టర్ సానే శేఖర్‌తో 11 మండలాల్లోని ఎంపీడీఓలు, వైద్యాధికారులు, ఎంఈఓలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

# కూచిపూడి ప్రదర్శనలో విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు

పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు

**లక్కిరెడ్డిపల్లె :** మండలంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న ఉమా దుర్గావతి అనే విద్యార్థినీ రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శనతో శివనంది అవార్డు అందుకున్నారని ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. ఈనెల 15వ తేదీన శ్రీకాళహస్తీలో జరిగిన రాష్ట్రస్థాయి అవార్డు సాధించినందుకు సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కూచిపూడి ప్రదర్శనలో అవార్డు సాధించి పాఠశాల, జిల్లాకు పేరును తీసుకురావడం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో కూచిపూడిలో మరిన్ని అవార్డులు సాధించాలని తెలియజేశారు. అలానే పాఠశాల నుంచి వివిధ క్రీడలలో పలువురు విద్యార్థులు ఎంపిక అవ్వడంతో వారిని ఉపాధ్యాయులు అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ అంజనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉమాదుర్గావతిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

# అర్జీదారులకు ఉచిత భోజన వసతి

**రాయచోటి :** జిల్లా నలుమూలల నుంచి అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనకు విచ్చేసిన అర్జీదారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతిని కల్పించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు వచ్చే అర్జీదారులకు ఈ వసతి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం నేటితో 39వ వారానికి చేరుకుంది. భోజన వసతులు కల్పించడం పట్ల ప్రజలు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

### 3న సర్వసభ్య సమావేశం

**పెనగలూరు :** నవంబర్ నెల 3వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరుగనుందని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

### సదస్సుల నిర్వహణతో కొత్త విషయాలపై అవగాహన

**రాజంపేట :** ఫార్మసీ విద్యారంగంలో వివిధ స్థాయిలలో సదస్సులు నిర్వహించడం వల్ల కొత్త విషయాలపై అవగాహన కలుగుతుందని ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి అన్నారు. సోమవారం తన చాంబరులో నవంబరు 17, 18వ తేదీలలో రెండు రోజులపాటు ఔషధ రంగం, జీవిత శాస్త్రాలులో నూతన అంశాలపై జాతీయ సదస్సు బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఫార్మసీ విద్యకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. ప్రిన్సిపాల్ డా.స్వర్ణలత మాట్లాడుతూ బయో ఫార్మా సంవాద్ – 2023 పేరుతో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు ఆసక్తి కలిగిన లైఫ్‌సైన్స్ విద్యార్థులు పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 9908344380, 9912396907, 8500000075 ఫోన్ నంబర్లను సంప్రందించగలరన్నారు. కార్యక్రమంలో డా.పి.ద్వారకనాథరెడ్డి, డా.పి.అనిత, అధ్యాపకులు వై.ప్రదీప్ కుమార్, ఇ.గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### స్మశాన స్థల ఆక్రమణను తొలగించండి

**పెనగలూరు :** మండలంలోని అనంతంపల్లి పంచాయతీ దళితవాడకు చెందిన స్మశాన స్థల ఆక్రమణలను తొలగించాలని సోమవారం తహసీల్దార్ శ్రీధర్ రావుకు గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో వారు మాట్లాడుతూ మా పూర్వీకుల కాలం నుంచి అదే స్థలంలో చనిపోయిన వారి మృతదేహాలను పూడ్చుకుంటున్నామని వారు తెలిపారు. ఇటీవల అగ్రవర్ణానికి చెందిన ఓ రైతు స్మశాన స్థలాన్ని ఆక్రమించి కంపవేశారని తెలిపారు. ఇది వరకే రెవెన్యూ సిబ్బంది రైతుకు, స్మశానికి కొలతలు వేసి వేరు చేసినప్పటికీ దౌర్జన్యంగా స్మశాన స్థలంలో కంపవేశారన్నారు. కబ్జా చేయడమే కాక దుర్భాషలాడినట్టు వారు తెలియజేశారు. వెంటనే కంప తొలగించి రెవెన్యూ సిబ్బంది కొలతలు ప్రకారం తమకు స్మశాన స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. అనంతరం దళితులకు తగు న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలియజేశారు.

### పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న శారద ఫౌండేషన్ అధ్యక్షుడు శంకర్ రెడ్డి

**ఓబులవారిపల్లె :** శారద ఫౌండేషన్ ద్వారా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5 వేలను ఫౌండేషన్ వ్యవస్థాపకులు శంకర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర్ రెడ్డి మాట్లాడుతూ శారద ఫౌండేషన్ ద్వారా గత 12 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉన్నతస్థాయి చదువులకు ఆర్థికంగా చేయూతనందిస్తోందన్నారు. పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఫౌండేషన్ తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు చదువులో రాణించి అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

**సంబేపల్లె :** మండల పరిధిలోని నారాయణరెడ్డి పల్లె పంచాయతీ, కొండావాండ్లపల్లెకు చెందిన ఓ వ్యక్తికి మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు సంబేపల్లె ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండావాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ఇటీవల మద్యం సేవించి వాహనం నడిపినందుకు సంబేపల్లె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా సోమవారం రాయచోటీ ఏజేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్ఎంటీకే శారద వెంకటరమణకు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గృహ నిర్మాణాలలో వేగం పెంచాలి

గృహ నిర్మాణం, మున్సిపల్ శాఖల అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

**రాయచోటి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద, మధ్య తరగతుల ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచి నవంబర్ చివరికల్లా పూర్తి చేసేలా పనులలో వేగం పెంచాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటిలోని తన కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాతో కలిసి గృహ నిర్మాణ, మునిసిపల్ శాఖల అధికారులతో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న వైఎస్ఆర్ జగనన్న కాలనీలు, ఇతర హౌసింగ్ నిర్మాణాలపై ఎమ్మెల్యే సమీక్షించారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు పక్కా గృహాల నిర్మాణాలను చేయిస్తోందన్నారు. నియోజకవర్గంలో 19,476 గృహాలు మంజూరు అయ్యాయన్నారు. వాటిలో ఇప్పటి వరకు 5978 గృహాలు పూర్తి అయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 4 వేల గృహాల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. మునిసిపాలిటీ పరిధిలో వెయ్యి, మిగిలిన మండలాలలో 3 వేలు నిర్మాణాలను నవంబర్ చివరి కల్లా ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.

**జగనన్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనపై ఆరా**

జగనన్న కాలనీలలో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలానే జగనన్న కాలనీల అర్చి నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మండలాల వారీగా ఎన్నెన్ని మంజూరయ్యాయి వాటి నిర్మాణ పరిస్థితులపై ఆరా తీశారు. బిల్లుల చెల్లింపులలో లబ్ధిదారులను ఇబ్బందులు పెడితే సహించనని హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. రెగ్యులర్‌గా బిల్లులను చెల్లించాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఎటువంటి లంచాలు తీసుకోకూడదన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సాంబశివయ్య, ఈఈ పూలచంద్రశేఖర్, మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, అన్ని మండలాల హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

**బారసాలలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**చిన్నమండెం :** మండల కేంద్రంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు జహీర్‌ఖాన్, యహియాఖాన్‌ల మనుమరాలి బారసాలలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏజాస్ అలీఖాన్, బుర్హాన్‌ఖాన్, సుబకతుల్లాఖాన్, సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు శ్యామ్, వెంకటప్పనాయుడు, నాగేశారెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, శివారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం



పుల్లంపేట: పోటీలకు ఎంపికైన వారితో పీడీ బాలశేఖర్

**సిద్దవటం :** రాష్ట్రస్థాయిలో జరిగే నెట్‌బాల్, స్విమ్మింగ్ పోటీలకు సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఫిజికల్ డైరెక్టర్ రెడ్డెమ్మలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ఈనెల 27న చెన్నూరు మండలంలోని రామనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలో అండర్–14 విభాగం నుంచి 7వ తరగతి చెందిన శివశంకర్, జాస్మిన్‌లు ఎంపికయ్యారన్నారు. అండర్–17 విభాగంలో 10వ తరగతికి చెందిన నవీన్, ఇస్మాయిల్‌అలీ, 9వ తరగతికి చెందిన ఎస్.నందిని, స్టాండ్ బైగా సింధూరి ఎంపికయ్యారన్నారు. అండర్–19 విభాగంలో 10వ తరగతికి చెందిన రమణ, గణేష్, ముఖేష్, స్టాండ్ బైగా సురేంద్ర ఎంపికయ్యారన్నారు. అంతే గాకుండా కడప స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 28న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల ఎంపికలో 10వ తరగతికి చెందిన డి.వాసు, 9వ తరగతికి చెందిన బి.వెంకటసాయి ఎంపికయ్యారన్నారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీల్లో ప్రతిభచాటి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు పుల్లంపేట విద్యార్థినులు**

**పుల్లంపేట :** మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పల్లవి, శ్రీవిద్య, త్రినేత్ర కళ, భావన అనే నలుగులు విద్యార్థినులు సోమవారం ప్రొద్దుటూరులో జరిగిన అండర్–14, అండర్–17లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ బాలశేఖర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరగనున్న కడప జిల్లా జట్టు తరపున తమ పాఠశాల విద్యార్థులు క్రీడలలో పాల్గొంటారన్నారు.

# నవంబర్ 2న బ్రీఫ్‌కేస్ టీజర్ విడుదల



మాట్లాడుతున్న సినిమా హీరోలు తదితరులు

**ఓబులవారిపల్లె :** ఓబులవారిపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 2వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటల నుంచి బ్రీఫ్‌కేస్ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సినిమా హీరో నరసింహులు తెలిపారు. సోమవారం మండలానికి చెందిన గాదెల కొత్తపల్లి గ్రామంలో సినిమా టీజర్ విడుదలపై చిత్రబృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాదెల కొత్తపల్లి దళితవాడ గ్రామానికి చెందిన హీరో నరసింహులు మాట్లాడుతూ ముగ్గురు హీరోలతో కలిసి బ్రీఫ్ కేస్ సినిమాను చిత్రీకరించామని, ప్రస్తుతం సినిమా టీజర్‌ను సొంత మండలంలో విడుదల చేయనున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొన్నారు.

# అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కొండారెడ్డి

**రామాపురం :** అవగాహనతోనే ప్రమాదాల నివారణ చేయవచ్చునని మండల ఎస్ఐ కొండారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బండపల్లె టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ మండలంలో ఎక్కువ భాగం జాతీయ రహదారి ఉండడంతో అధిక సంఖ్యలో వాహనాల రద్దీ ఉంటుందన్నారు. ద్విచక్రవాహనదారులు పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎక్కువ మంది ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా తమ విలువైన ప్రాణాలు ఎంతో మంది కోల్పోయారని, అలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని కోరారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాన్ని నడపరాదని, వాహనానికి సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. అనంతరం ప్రమాదాలు జరిగిన స్థలాలు, ప్రమాదాల ఫొటోలను ప్రజలకు చూపించారు.

# అధికారుల గైర్హాజరుపై 'చైర్మన్ పోలా' ఆగ్రహం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని కమిషనరుకు ఆదేశం
- కౌన్సిల్ సమావేశంలో పలు తీర్మానాలు



కౌన్సిల్ మీట్‌లో పాల్గొన్న కౌన్సిలర్లు, తదితరులు

**రాజంపేట :** రాజంపేట పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి వివిధ శాఖల అధికారుల గైర్హాజరుపై పురపాలక సంఘం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పురపాలక సంఘం నుంచే కాకుండా ఇతర శాఖల రెవెన్యూ, పోలీసు, ఏపీఎస్పీడీసీఎల్‌తోపాటు పలు శాఖలకు సంబంధించి పట్టణంలో పలు సమస్యలను కౌన్సిల్ దృష్టి తీసుకురావాలనుకుంటుందన్నారు. అటువంటి సమయంలో సంబంధిత అధికారులు లేకుండా సమస్యలకు పరిష్కారమార్గం ఎలా చూపుతామన్నారు. గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయాలని కమిషనరు జనార్దన్ రెడ్డిని చైర్మన్ ఆదేశించారు. రాబోయే కౌన్సిల్ మీట్‌లో అన్ని శాఖల అధికారులు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల వేగవంతంపై కౌన్సిల్ స్పీడ్‌గా నిర్ణయాలు తీసుకుంది. అభివృద్ధి అంశాలకు సంబంధించి పలు తీర్మానాలు చేశారు. పట్టణంలో నీటి సరఫరాను మెరుగైన రీతిలో అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మెరుగైనా పారిశుధ్యం అందించేందుకు డ్రైనేజీ వ్యవస్థను మరింతగా బలోపేతం చేసే దిశగా నిర్మాణ పనులు చేయాల్సి ఉంటుందన్నారు. పట్టణంలో పలు వార్డులలో సిమెంట్ రోడ్డులు నిర్మితం కావాల్సి ఉందన్నారు. పురపాలక సంఘం పార్కు అభివృద్ధి, ఖాళీ స్థలాల పరిరక్షణపై దృష్టి సారించామన్నారు. పట్టణంలో వీధిలైట్లు లేని చోట్లను గుర్తించి అక్కడ వీధిలైట్లను వేయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.